అమరవీరుల స్థూపాన్ని తాకే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర చైర్మన్‌ సుల్తాన్‌ యాదగిరి


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సుల్తాన్‌ యాదగిరి, ప్రఫుల్‌ రాంరెడ్డి తదితరులు

కాచిగూడ: అమరవీరుల స్థూపాన్ని తాకే అర్హత కూడా బీఆర్‌ఎస్‌కు లేదని తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర చైర్మన్‌ సుల్తాన్‌ యాదగిరి అన్నారు. అమరవీరుల స్థూపాన్ని బీఆర్‌ఎస్‌ నేతలు తాకడాన్ని నిరసిస్తూ స్థూపానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల బీఆర్‌ఎస్‌ పాలనలో గుర్తుకురాని అమరవీరుల స్థూపం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ఆయన ప్రశ్నించారు. జాబ్‌ క్యాలెండర్‌ పేరుతో అసెంబ్లీ ముందు గన్‌పార్క్‌ వద్ద ఉన్న అమరవీరుల స్థూపాన్ని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు, నాయకులు తాకి మైల చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌ పాలనలో నాటి సీఎం కేసీఆర్‌ ఏనాడు అమరవీరులను గౌరవించలేదని, ఉద్యమకారులను అణిచి వేశాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు టి.ప్రఫుల్‌ రాంరెడ్డి, రంగారెడ్డి, భీమారావు కేసీఎస్‌ ప్రసాద్‌, ఎం.వెంకటస్వామి, వెంకట్‌ నారాయణ, బి.సోమన్న, బి.యాదగిరి, చంద్రుడు, బి.దయానంద్‌, కొండస్వామి, వి.అరుణ, డి.వెంకటలక్ష్మి, లలిత, సుజాత, స్వరూప రాణి, దప్పు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలే విజయానికి సోపానాలు

హైదరాబాద్‌ మెట్రో రైల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఎన్‌వీఎస్‌ రెడ్డి


ప్లాటినం జూబ్లీ వేడుకలను ప్రారంభిస్తున్న హైదరాబాద్‌ మెట్రో రైల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌

కాచిగూడ: ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని హైదరాబాద్‌ మెట్రో రైల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఎన్‌వీఎస్‌ రెడ్డి అన్నారు. శనివారం కాచిగూడలోని బద్రుకా కామర్స్‌ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జ్యోతి వెలిగించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదురయ్యే అవరోధాలను అధిగమించాలన్నారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కామర్స్‌లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ శ్రీకిషన్‌ బద్రుక, డైరెక్టర్‌ జనరల్‌, ప్రొఫెసర్‌ అభిరామ కృష్ణ, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మోహన్‌ కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్స్‌, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి


తహసీల్దార్‌ సంధ్యారాణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హిమాయత్‌నగర్‌ మండల కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్‌ సంధ్యారాణి కోరారు. శనివారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని రకాల సర్టిఫికెట్లతో పాటు పింఛన్‌లు, మండల పరిధిలోని భూ సమస్య, తదితర వాటి పరిష్కారాల కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బందితో ఇలాంటి ఇబ్బంది ఉన్నా, సర్టిఫికెట్ల జారీలో ఆలస్యమైనా నేరుగా తమ దృష్టికి తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందజేత


ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

నల్లకుంట: పద్మ విభూషణ్‌, దివంగత డాక్టర్‌ బాలమురళీ కృష్ణ 94వ జయంతి కార్యక్రమ ఆహ్వాన పత్రికను శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్వీ.చెన్నారావు మాట్లాడుతూ.. బాగ్‌ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఏసీ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి జి.కిషన్‌ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌, హైకోర్టు జడ్జి జస్టిస్‌ రాధారాణి, విశ్రాంత ఐఏఎస్‌ అధికారి కేవీ.రమణాచారి హాజరవుతారని వెల్లడించారు. అలాగే సంగీత నాట్య అకాడమీ చైర్‌పర్సన్‌ అలేఖ్య పుజాల, ప్రముఖ సంగీత దర్శకుడు వినోద్‌ బాబు, మామిడి హరికృష్ణ తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు, కళారత్న డీవీ మోహన కృష్ణ ఆధ్వర్యంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం, రాగ వర్ధిని కల్చరల్‌ సొసైటీ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్‌ కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌

కాచిగూడ: కాంగ్రెస్‌ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ డిమాండ్‌ చేశారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌లో సుమారు రూ.3,500 కోట్లు కోత విధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ అభయ హస్తం, ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా స్వయం ఉపాధి రుణాలు, షెడ్యూల్డ్‌ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునఃనిర్మాణం కోసం నిధుల కేటాయింపులు జరగలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎస్సీల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 5, 6, 7 తేదీల్లో తహసీల్దార్‌ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలమైనందున ఈనెల 17వ తేదీన చేవెళ్లలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డాక్టర్‌ ఎన్‌.గౌతంరావు, ఆత్మకూరి కాంతికిరణ్‌, కుమ్మరి శంకర్‌, ఎన్‌.మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోపై విరిగి పడ్డ చెట్టు కొమ్మ

తప్పిన ప్రమాదం



నల్లకుంట: చెట్టు కొమ్మ విరిగి అక్కడ ఉన్న ఆటోపై పడింది. డ్రైవర్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన శనివారం జరిగింది. ఉదయం 11 గంటలకు శంకరమఠం మార్కెట్‌ సమీపంలోని ఎస్‌ఎల్‌ డయాగ్నోస్టిక్‌ సెంటర్‌కు ఎదురుగా రోడ్డుకు అవతలివైపు ఉన్న ఓ భారీ చెట్టు కొమ్మ ఒక్కసారిగా విరిగిపడింది. ఆ సమయంలో అక్కడే నిలిపి ఉన్న ఆటోపై ఆ చెట్టు కొమ్మ మొదలు పడింది. దీంతో ఆటో కొంత ధ్వంసమైంది. ఆటో డ్రైవర్‌ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. చెట్టు కొమ్మ రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌ జామైంది. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ట్రాఫిక్‌ పోలీసులు, స్థానికుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మను తొలగింపజేశారు. ట్రాఫిక్‌ పోలీసులను ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు. ఇప్పటికైనా భారీ వృక్షాల చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలి

కాచిగూడ: ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను హుజురాబాద్‌ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నువ్వేంతా నీ స్థాయిఎంతా చూసుకుందాం రా..! అంటూ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఎవరూ ఊరుకోరని, పద్ధతి మార్చుకోకుంటే గుణపాఠం తప్పదని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌ రావు, ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్‌ హెచ్చరించారు. శనివారం వారు మాట్లాడుతూ.. దానం నాగేందర్‌ మాట్లాడిన విషయంపై సభలోనే క్షమించాలని కోరినప్పటికీ బీఆర్‌ఎస్‌ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

ముషీరాబాద్‌: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. శనివారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ సీనియర్‌ నాయకులు జి.వెంకటేష్‌ ఆధ్వర్యంలో సంబరాలు జరిపి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగలకు విద్యా, ఉద్యోగ, రంగాలలో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చకుర్తి ప్రభాకర్‌, సుధాకర్‌గుప్తా, శంకర్‌ ముదిరాజ్‌, మురళీ, దామోదర్‌రెడ్డి, రవీందర్‌, అరుణ్‌, కళ్యాణ్‌, శివ, బల్వంత్‌రాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నమ్మకాన్ని ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారు

ప్రముఖ సైకాలజిస్టు మల్లేష్‌ అన్నమైన


సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ సైకాలజిస్టు మల్లేష్‌ అన్నమైన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లలకు నమ్మకాన్ని ఇస్తే అద్భుతాలను సృష్టిస్తారని ప్రముఖ సైకాలజిస్టు, రచయిత మల్లేష్‌ అన్నమైన అన్నారు. వంద చాలెంజ్‌లను ఎదుర్కొనే ధైర్యాన్ని పిల్లలకు ఇవ్వాలని ఆయన సూచించారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెయింట్‌ ఆడమ్స్‌ హైస్కూల్‌ ఆధ్వర్యంలో పేరెంట్స్‌, టీచర్స్‌ కౌన్సెలింగ్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లేష్‌ అన్నమైన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసినప్పుడే వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఆ దిశగా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక విద్య దశ నుంచే వారిలో క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లను నేర్పించాలని సూచించారు. విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమైందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎస్‌.శ్రావణ్‌కుమార్‌ మాట్లాడుతూ పిల్లలకు తల్లే ఆదిగురువు అని అన్నారు. పిల్లలకు ముఖ్యంగా డబ్బు కంటే సమయాన్నే ఇవ్వాలని అప్పుడే వారిలో ఎదుగుదలను చూడవచ్చునన్నారు. మంచి స్నేహితులు లేకుంటే పిల్లలు చెడిపోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. నేడు విద్యార్థులు పెడదారిన పడడానికి వారి అలవాట్లు, ఇంటి పరిసరాలే ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త కడియాల ప్రభాకర్‌, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలిసిమెలసి ఉంటేనే సాఫీగా సంసారం



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి

చిక్కడపల్లి: భార్యాభర్తలు కలిసిమెలసి ఉంటేనే సంసారం సాఫీగా సాగుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి అన్నారు. ఆరాధన కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి పాల్గొని ఎంపిక చేసిన దంపతులకు పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం బాగుటుందని, ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ కాదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దిట్టకవి శ్రావణ్‌స్వామి, భార్గవి, రామరాజు శ్రీనివాస్‌, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, జి.హనుమంతరావు, శ్రీనివాసన్‌, ములుగు శివజ్యోతి, డాక్టర్లు పద్మజ, శ్రీనివాసరాజు, రంగయ్య మాస్టారు, తిరుమలగుడిమెళ్ల యతీంద్రప్రవణాచార్యులు, రంగనాయిక, రమేష్‌, శివపార్వతి, లంకాలక్ష్మీనారాయణ, ఉమర్‌ఖాన్‌, లోకం కృష్ణయ్య, నిర్మల ప్రభాకర్‌, సిఎస్‌ మూర్తి, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం అందరూ కలిసి పోరాడాలి


సమావేశంలో నాగేశ్వర్‌రావు తదితరులు

చిక్కడపల్లి: రాజ్యాధికారం కోసం అందరూ కలిసి పోరాడాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి త్యాగరాయగానసభలోని కళాలలిత కళావేదికలో తెలంగాణ వికలాంగుల హక్కుల వేదిక తెలంగాణ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వికలాంగుల శాఖ మాజీ చైర్మన్‌ పిన్నమనేని సాయిబాబా, ఫిలిం ఛాంబర్‌ కార్యదర్శి ముత్యాల రామదాసులు మాట్లాడుతూ అసెంబ్లీలో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్‌ కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఎక్కడో పుట్టిన ఆంగ్లో ఇండియన్‌ లకు పార్లమెంట్లో నామినేట్‌ చేస్తున్నారని, ఇక్కడ పుట్టి, ఇక్కడ పెరిగిన వికలాంగులకు ఎందుకు నామినేట్‌ చేయరని ప్రశ్నించారు. రాబోయే కాలంలో రాజ్యాధికారం కోసం అందరూ కలసి పోరాడాలని ఆయన కోరారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారే దివ్యాంగులను కించపర్చడం సిగ్గుచేటని విమర్శించారు. ఏ ఈ కార్యక్రమంలో అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక నాయకులు పంది శ్రీనివాస్‌, పులిపాటి శ్రీనివాస్‌ వెంకటేష్‌, లక్ష్మీ, శంకర్‌, శ్రీనివాస్‌, గోవింద్‌ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేత


24మంది లబ్ధిదారులు చెక్కులను పంపిణీ చేస్తున్న ముఠాగోపాల్‌

చిక్కడపల్లి: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాంనగర్‌ డివిజన్‌కు చెందిన 24 మంది లబ్ధిదారులు రూ.8.46,000 విలువ కలిగిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధితో ఎంతోమంది ప్రాణాలు నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు శంకర్‌ముదిరాజ్‌, కె. అరుణ్‌, ఎం.మురళి, సుధాకర్‌ గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్‌, కల్యాణ్‌ నాయక్‌, జి.వెంకటేష్‌, శివయాదవ్‌, రమేష్‌రెడ్డి, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి


భోలక్‌పూర్‌లో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌, కవాడిగూడ దారిలో వెళ్లే బస్సుల సంఖ్యను తగ్గించడం వల్ల ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ముషీరాబాద్‌ నియోజకవర్గం జోన్‌ కమిటీ కార్యదర్శి దశరథ్‌ పేర్కొన్నారు. వెంటనే బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని ఆయన ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్‌ చేశారు. శనివారం భోలక్‌పూర్‌ బస్టాప్‌లో 20 నెంబర్‌ బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్‌ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రూట్‌లో వెళ్లే 20 నెంబర్‌ బస్సులు గంటకొకటి కూడా రాకపోవడం వల్ల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. భోలక్‌పూర్‌, కవాడిగూడ మీదుగా వెళ్లే 45 నెంబర్‌ బస్సులను పూర్తిగా రద్దు చేశారని తెలిపారు. ఈ రోడ్‌లో 45 నెంబర్‌ బస్సులను పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు బాబూరావు, విమల, వెంకటేష్‌, శ్రీనివాస్‌, కృష్ణ, రాంచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నా భర్త కుమారస్వామిది ఆత్మహత్య కాదు



కుమారస్వామి ఫొటోతో భార్య అఖిల, ఆమె అత్తమామలు భాగ్యలక్ష్మి, లక్ష్మణ్‌ తదితరులు

- యువతి వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడు : మృతుడి భార్య అఖిల
- కేసును దర్యాప్తు చేస్తున్నాం : చిక్కడపల్లి పోలీసులు

ముషీరాబాద్‌: ఓ యువతి ఆమె కుటుంబ సభ్యులు పెట్టిన వేధింపుల వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య అఖిల, ఆమె అత్తమామలు భాగ్యలక్ష్మి, లక్ష్మణ్‌లు ఆరోపించారు. కుమారస్వామిది ఆత్మహత్య కాదని హత్యేనని అతని సెల్‌ఫోన్‌ కాల్స్‌, వాట్సాప్‌ చాటింగ్‌లను ఆధారంగా సమగ్ర విచారణ జరిపి అతను ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వారిపై చట్టపరుగా కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. శనివారం రాంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మృతుడి భార్య అఖిల తమ అత్తమామలు భాగ్యలక్ష్మి, లక్ష్మణ్‌లతో కలసి మాట్లాడారు. రాంనగర్‌లోని మేదర బస్తీకి చెందిన తనకు అచ్చయ్యనగర్‌కు చెందిన కుమారస్వామి 2019 నవంబర్‌ 2వ తేదీన తాము ప్రేమ వివాహం చేసుకున్నామని తెలిపారు. అదే సంవత్సరం తన తల్లిదండ్రులు రెండోసారి డిసెంబర్‌ 11న ప్రేమ వివాహాన్ని పెద్దలంతా అంగీకరించి పెద్దల సమక్షంలో మరోసారి వివాహం జరిపించారని తమకు మూడు సంవత్సరాల వయస్సు గల మాన్యశ్రీ కూతురు ఉందని తెలిపారు. కుమారస్వామి ఫ్లవర్‌ డెకరేషన్‌ వృత్తి చేస్తూ తమ కుటుంబాన్ని పోషిస్తున్నారని తెలిపారు. గత కొంత కాలం క్రితం రాంనగర్‌కు చెందిన తన సమీప బంధువుల కుమార్తె తన భర్త కుమారస్వామిని ప్రేమిస్తున్నాని వెంటపడిందని తెలిపారు. దీంతో మా అత్తమామలతో పాటు బంధువులు విషయాన్ని ఆ యువతి బంధువులకు తెలియజేసి కుమారస్వామి వెంటపడవద్దని మందలించడం జరిగిందని చెప్పారు. గతకొద్ది రోజులుగా తన భర్తతో ఆ యువతి తరచూ ఫోన్‌ చేస్తూ వాట్సప్‌ చాటింగ్‌ చేస్తూ ఇబ్బందులకు పాల్పడుతూ వచ్చిందని తెలిపారు. అయితే జులై 28వ తేదీ ఆ యువతి నుంచి పలుమార్లు ఫోన్‌ వచ్చాయని ఈ క్రమంలో ఏమి జరిగిందో తెలియదని ఈ సమయంలో ఆయన ఆందోళనలో ఉన్నట్లు కనిపించారని తెలిపారు. ఈ క్రమంలోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. దీంతో విషయాన్ని గమనించిన తాము వెంటనే అతన్ని ఆంధ్ర మహిళా ఆసుపత్రికి తరలించామని అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధృవీకరించారన్నారు. దీంతో ఆత్మహత్యకు ఆ యువతే కారణమని చిక్కడపల్లి పోలీసులు అదే రోజు రాత్రి ఫిర్యాదు చేయడం జరిగిందని, అయితే పోలీసులు తాము చెప్పిన ఫిర్యాదు ప్రకారం కాకుండా కేవలం ఆత్మహత్య చేసుకున్నారని కేసు నమోదు చేశారని ఆరోపించింది. ఈ విషయంపై నగర పోలీసు కమిషనర్‌, సెంట్రల్‌ జోన్‌ డీసీపీ, చిక్కడపల్లి ఏసీపీలు స్పందించి తాము ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కుమారస్వామి ఆత్మహత్యపై విచారణ జరిపించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఆమె బంధువులు పాల్గొన్నారు.

ఫోన్‌కాల్స్‌, వాట్సాప్‌ ఆధారంగా విచారణ ప్రక్రియను మొదలుపెట్టాం

కుమారస్వామిది ఆత్మహత్య కాదని ఓ యువతి వేధింపుల వల్ల చనిపోయారని అతని భార్య అఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారస్వామి ఫోన్‌కాల్స్‌, వాట్సప్‌ చాటింగ్‌ ఆధారంగా విచారణ ప్రక్రియను ప్రారంభించామని కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు చిక్కడపల్లి ఎస్‌ఐ శశిపాల్‌రెడ్డి తెలిపారు. ఫోన్‌కాల్స్‌, చాటింగ్స్‌ వల్లే కుమార స్వామి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమని తెలితే ఆ యువతిపై చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

– చిక్కడపల్లి ఎస్‌ఐ శశిపాల్‌రెడ్డి

పోలీసు సిబ్బందికి మెగా హెల్త్‌ క్యాంపు

సాక్షి, సిటీబ్యూరో: అంబర్‌ పేటలోని ఆర్మ్‌డ్‌ హెడ్‌ క్వార్టర్‌లో రాచకొండ రిజర్వు పోలీసు సిబ్బందికి శనివారం ఉచిత మెగా హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించారు. మెడికవర్‌ హాస్పిటల్‌ ఆరోగ్య, రక్త పరీక్షలు, సౌజన్య డెంటల్‌ హాస్పిటల్‌ దంత పరీక్షలు నిర్వహించాయి. వివిధ విభాగాలకు చెందిన 320 మంది సిబ్బంది బీపీ, షుగర్‌, ఈసీజీ, 2డీ ఎకో, డెంటల్‌ వంటి పలు పరీక్షలు చేయించుకున్నారు.

సాఫ్ట్‌వేర్‌ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్‌ స్కిల్‌ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్‌ సాఫ్ట్‌వేర్‌ కోర్సుల్లో ఆన్‌లైన్‌ శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ సాయి శ్రీమాన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌, డిగ్రీ పీజీ, పాలిటెక్నిక్‌, ఇంజినీరింగ్‌ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 9505800050లో సంప్రదించాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కాచిగూడ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని నారాయణ టెక్నో స్కూల్‌ ఏజీఎం బాల పరమేశ్వర్‌ అన్నారు. నారాయణగూడలోని నారాయణ పాఠశాలలో శనివారం విద్యార్థుల క్యాబినెట్‌ ఇన్‌స్టాలేషన్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెడ్‌ బాయ్‌, హెడ్‌ గర్ల్‌ నియామకం కోసం ఎన్నికల నామినేషన్‌ వేసి ఎన్నుకున్నారు. గెలుపొందిన విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా విద్యార్థులకు ఎన్నిక ప్రక్రియపై అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ హర్నిత్‌ కౌర్‌, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ రవీందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధమవ్వాలి

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని బీజేపీ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షులు డాక్టర్‌ ఎన్‌.గౌతమ్‌ రావు కార్యకర్తలకు సూచించారు. శనివారం పార్టీ గోల్నాక డివిజన్‌ కార్యవర్గ సమావేశం నగర కార్యాలయంలో జరిగింది. సమావేశానికి మాజీ మంత్రి కృష్ణయాదవ్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. హామీల అమలు కోసం ఎక్కడికక్కడ ప్రశ్నించాలన్నారు. పార్టీ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో డివిజన్‌ అధ్యక్షులు మూల రవీందర్‌గౌడ్‌, నాయకులు కృష్ణగౌడ్‌, నర్సింగ్‌రావు యాదవ్‌, శ్యాంరాజ్‌, రమేష్‌, రవీందర్‌, కృష్ణంరాజు, సునీల్‌, ఎస్‌ రాజేశ్‌, విశ్వక్‌ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

కాచిగూడ: రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ పట్ల కొంత మంది తప్పుడు ఆరోపణలు చేస్తూ మున్నూరు కాపులను తప్పుదోవ పట్టించడం సరికాదని, అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు కేసులో పిల్లి శ్రీనివాస్‌ ఓడిపోయారని, రూ.25 లక్షల అవకతవకలు జరిగాయంటూ సోషల్‌ మీడియా వేదికగా తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాంటి వారికి సభ్యులే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

కూడళ్ల వద్ద సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి

ట్రాఫిక్‌ అదనపు కమిషనర్‌ విశ్వప్రసాద్‌కు కార్పొరేటర్‌ వినతి

చిక్కడపల్లి: రోడ్డు ప్రమాదాలు జరుగకుండా అవసరమైన ప్రాంతాలలో స్పీడ్‌బ్రేకర్లు, కూడళ్ల వద్ద సిగ్నళ్లు ఏర్పాటు చేయాలని గాంధీనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎ.పావని వినయ్‌కుమార్‌ ట్రాఫిక్‌ పోలీసులను కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ట్రాఫిక్‌ అదనపు కమిషనర్‌ విశ్వప్రసాద్‌కు ఆమె వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రమాదాలు జరుగకుండా వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలన్నారు. వాహనచోదకులు వేగంగా వెళ్తుండటంతో మహిళలు, సీనియర్‌ సిటిజన్స్‌ రోడ్డుదాటేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అశోక్‌నగర్‌ చౌరస్తాలో సిగ్నళ్లు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. సమస్యలు సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని ఆమె కోరారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

కవాడిగూడ: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ కె. బాల అన్నారు. తల్లిపాల వారోత్సవాల వేడుకలు శనివారం కవాడిగూడ డివిజన్‌ బండమైసమ్మ నగర్‌ కమ్యూనిటీ హాల్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్‌ కె. బాల మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిపాలకు ఉన్న ప్రాముఖ్యతను పిల్లల ఎదుగుదలకు వారి ఆరోగ్యానికి ఏ విధంగా దోహదపడుతాయో చంటిపిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వారోత్సవాలలో భాగంగా ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాశన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్‌లు స్వప్న, కవిత, సంతోషిని, టి. ధనమ్మ, స్వప్న, కె. శారద, రఫియా సుల్తానా, ఏఎన్‌ఎం సుశీల తదితరులు పాల్గొన్నారు.

మోదీ మద్దతుతోనే ఎస్సీ వర్గీకరణ

ముషీరాబాద్‌: మాదిగల రిజర్వేషన్‌ పోరాటానికి ప్రధాని నరేంద్రమోదీ మద్దతు ఇవ్వడం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందగిరి నర్సింహ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తూ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనం చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, సత్యనారాయణ, ప్రభాకర్‌, జీవన్‌, నర్సింగ్‌రావు, సాయిబాబా, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌, ప్రొఫెసర్‌ ఎంఆర్‌ వెంకట్‌రావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 10వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 040–24658160లో సంప్రదించాలని సూచించారు.